క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన నాయకులు

తాండూరు రూరల్: మండలంలోని చంద్రవంచ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి గ్రామంలో అంబేడ్కర్ భవనం, సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అంతారం శ్రీను, విజయ్‌కుమార్, అనంతప్ప, అంజిలప్ప, నర్సింలు, నవాబ్‌మియాలు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న యువకుడు

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామ యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలికల మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఉండటంతో విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అపరిశుభ్రం కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని హెచ్‌ఎం వైద్యనాథ్‌ను కోరారు. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు చిరంజీవి, రమేశ్, అమర్నాథ్‌స్వామి, బాలజీ, శివకుమార్, మౌలానాలు ఉన్నారు.

షాహిద్‌కు సన్మానం



షాహిద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: స్వచ్ఛదనం– పచ్చదనం వ్యాసరచన పోటీల్లో జిల్లాలో ప్రథమస్థానం పొంది, స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా బహుమతి పొందిన విద్యార్థి షాహిద్‌ను శనివారం శాలువాతో సన్మానించి, హంసధ్వని కవితా సంపుటిని బహుకరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్యం నుంచే విద్యార్థులు తమకు నచ్చిన విషయాల్లో నైపుణ్యం సాధించి జీవితంలో ఎదగాలన్నారు. చదువుతో పాటు సాహిత్య, సంస్కృతిక, క్రీడారంగాల్లో ప్రతిభను ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, యాదగిరి, సంధ్యారాణి, జయశ్రీ, అనిత, కవిత, శిరీషారెడ్డి, అనురాధ, నజీర్, రవికుమార్, ప్రతిభ భారతి, సవిత, ఇస్మాయిల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సూచనలు తప్పనిసరి



పంటను పరిశీలిస్తున్న అధికారి సందీప్‌రెడ్డి

దోమ: రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి, పంటల ఉత్పత్తిలో అధిక దిగుబడిని పొందాలని వ్యవసాయ శాఖ గణాంక అధికారి సందీప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బుద్లాపూర్‌లో పలువురు రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటమార్పిడి పద్ధతిని అవలంబించాలని పేర్కొన్నారు. చిరుధాన్యాల పంటల సాగు వల్ల అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. రైతులు నూతన పద్ధతులను పాటిస్తూ వ్యవసాయంలో లాభాలను పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు తప్పని తిప్పలు



వైద్యం కోసం వచ్చిన రోగులు

దోమ: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలు బంద్ చేశారు. దీంతో శనివారం రోగులు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు. వైద్యులు రారన్న సమాచారంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

భవనం పూర్తయ్యేనా?

- ఆగిన పాఠశాల భవన నిర్మాణ పనులు
- గదుల కొరతతో ఇబ్బందులు
- అప్పట్లో ఎమ్మెల్యే హోదాలో పనులు ప్రారంభించిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి



అసంపూర్తిగా వదిలేసిన అదనపు గదుల భవనం

దుద్యాల్: తరగతి గదుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు , ఇంగ్లిష్ మీడియం విడివిడిగా నిర్వహిస్తున్నారు. కాని, తరగతి గదుల కొరత కారణంగా తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులను ఒకే దగ్గర కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాఠాలు వినడంలో నష్టపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు గదుల నిర్మాణానికి 2013లో రూ.28 లక్షల నిధులు విడుదల కాగా, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే హోదాలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. దీంతో భవనం పనులు ముమ్మరంగా సాగాయి. మొదటి ఫ్లోర్ స్లాబ్ పూర్తి కాగా, రెండో ఫ్లోర్ పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ గదుల నిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాఠశాలలో తరగతుల కొరత ఏర్పడింది. గతంలో తెలుగు మీడియం ఒక్కటే అందుబాటులో ఉండడంతో ఉన్న గదులు సరిపోయాయి. ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి రావడంతో ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మించిన భాగం వరకు రూ. 6లక్షల ఖర్చు అయినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నారు. బిల్లు రాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు ఆయన చెప్పుకొచ్చారు. నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణానికి నిధులు విడుదల చేసి భవనం నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇంగ్లిష్ మీడియంకు గదులు లేవు



ఇంగ్లిష్ మీడియం బోధించడానికి తరగతి గదులు లేకపోవడంతో తెలుగు మీడియం తరగతి గదుల్లోనే పాఠాలు వింటున్నాం. దీంతో చాలా నష్టపోతున్నాం. అదనపు గదులు నిర్మించి తరగతి గదులు అందుబాటులోకి తేవాలి. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– చంద్రిక, 10వ తరగతి, ఇంగ్లిష్ మీడియం

మా గోడు పట్టించుకోండి



అదనపు తరగతి గదులు లేక చాలా ఇబ్బంది కల్గుతుంది. గతంలో చాలా మంది అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదు. తెలుగు, ఇంగ్లిష్ మీడియానికి సరిపడా తరగతి గదులు ఉంటేనే ఎవ్వరికి సంబంధించిన పాఠాలు వారు ఇబ్బంది లేకుండా వినవచ్చు. లేదంటే ఇరువురు నష్టపోతాం. అధికారులు స్పందించి అదనపు గదులు అందుబాటులోకి తేవాలి.

–శ్రీహరి, 10వ తరగతి, ఇంగ్లిష్ మీడియం

కేటీఆర్ రాజీనామా చేయాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పరిగి: మహిళలపై అమర్యాదగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని అన్నారు. కేటీఆర్‌కు మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్న వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే తప్పేది లేదన్నారు. ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చుతుంటే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఏం మాట్లాడాలో తెలియక అయోమయంలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృష్ణ, కౌన్సిలర్లు శ్రీనివాస్, రియాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు సురేఖరెడ్డి, సరిత, రజితరెడ్డి, ప్రేమలత పాల్గొన్నారు.

వికారాబాద్‌లో వర్షం

వికారాబాద్‌లో జిల్లాలో శనివారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పలు చోట్ల వాగులు పొరాయి. అనంతగిరి, మర్పల్లి,మోమిన్‌పేటలో ప్రజలు, తీవ్ర ఇబ్బంది పడ్డారు.



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం



మోమిన్‌పేట: కోటపల్లి రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి కింద నిలిచిన వాహనాలు



మర్పల్లి: సిరిపురం వీరన్నవాగు కల్వర్టుపై నుంచి పారుతున్న వరద నీరు

రాత్రి వేళ అడవిని నరుకుతున్నారు..

ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్‌లోని కొన్ని చోట్ల అక్రమార్కులు రాత్రిళ్లు అడవిని నరుకుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీప గ్రామాలు, తండావాసులు గుట్టుగా చెట్లను నరకడం దారుణమన్నారు. వన్యప్రాణులకు సంకటంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా ఎవరూ కూడా అడవిలోకి అక్రమంగా ప్రవేశించకూడదని పేర్కొన్నారు. గ్రామాలు, తండావాసులు తమకు సహకరించాలని కోరారు. అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

ఇద్దరు ఏఈఓలు బదిలీ

తాండూరు రూరల్: మండలం వ్యవసాయ కార్యాలయ పరిధిలోని నారాయణపూర్ క్లస్టర్ ఏఈఓ శిరీష , సిరిగిరిపేట్ క్లస్టర్ ఏఈఓ ఫర్వీన్‌లు బదిలీ అయ్యారు. ఏఈఓ శిరీష ధరూర్, ఫర్వీన్ వికారాబాద్‌కు కేటాయించారు. వారిస్థానంలో కొత్త ఏఈఓలు ఇంకా రాలేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: బషీరాబాద్ మండలం నవల్గా గ్రామానికి చెందిన దళిత మహిళను తన కొడుకు విషయంలో పీఎస్‌కు పిలిపించి కొట్టి, చిత్ర హింసలకు గురి చేసిన ఎస్‌ఐ రమేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీసీ, భారత్‌ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆయా సంఘాల నాయకులు

కుల్కచర్ల: ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో హిందూస్ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సేవ్ హిందూస్ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద రావు మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న దాడులపై ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. ఈ రోజు బంగ్లాదేశ్‌లో.. రేపు భారతదేశంలో జరిగే ప్రమాదం ఉందని హిందువులు మేల్కొనాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బొంరాస్‌పేట: తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారించేందుకు మండలంలోని తుంకిమెట్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. గ్రామంలోని మిషన్‌భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, వేసవికాలంలో ఇబ్బందులు పడుతుండటంతో మండల నాయకుడు పెద్ద బాల్‌రాజ్‌గౌడ్ చొరవ చూపారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో ఎస్సీకాలనీలో బోరు వేయించారు. ఎస్సీ, బీసీ, కొత్తకాలనీల ప్రజలు సీఎంకు, తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మండల పార్టీ నాయకులు పెద్దబాల్‌రాజ్‌గౌడ్, మండల మైనార్టీసెల్ అధ్యక్షుడు అనిఫ్, ఎస్సీసెల్ మండల నాయకులు వెంకటయ్య, యాదవ సంఘం గ్రామ ఉపాధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, నాయకులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

యాలాల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని యాలాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన ఎరుకలి నర్సమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకునేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షుడు మోయిజ్, అశోక్ నాయీ, నర్సింహులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే సర్కార్ లక్ష్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: పేదల సంక్షేమమే తమ సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం చౌడాపూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన హామీని ప్రకారం త్వరలోనే కల్యాణలక్ష్మి పథకానికి మరింత ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలితాలు అందాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నా మని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు లు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్యగౌడ్, నాయకులు శేఖర్, శివరాములు, గోపాల్, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

కుల్కచర్ల: దీప్లానాయక్ తండాను కొత్త గ్రాపంచాయతీ ఏర్పాటు కృషి చేసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు విఠల్ నాయక్ అన్నారు. శనివారం దీప్లానాయక్ తండాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సీపీఎస్ రద్దు చేయడమే లక్ష్యం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

యాలాల: సీపీఎస్ రద్దు, పాతపెన్షన్ విధానాన్ని సాధించడమే పీఆర్టీయూ లక్ష్యమని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పీఆర్టీయూ సభ్యత్వ పక్షోత్సవాలను నిర్వహించి, సభ్యత్వ నమోదుచేయించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 52 ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో సంఘం పాత్ర ఎంతో కీలకమన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు మొగులయ్య, జిల్లా బాధ్యులు క్రిష్టారెడ్డి, ప్రభాకర్‌చారి తదితరులు ఉన్నారు.

‘సమగ్ర’ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి



హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

యాలాల: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులను రైగ్యులరైజ్ చేయడంతో పాటు బేసిక్ పే(మినిమం టైం స్కేల్)ఇవ్వాలని వికారాబాద్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం టీపీఆర్టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో సమగ్ర ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. జిల్లా, మండల, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల, కేజీబీవీ తదితర విభాగాల్లో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పాఠశాల విద్య మెరుగుకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అందిస్తున్న విషయాన్ని హర్షవర్ధన్‌రెడ్డికి వివరించారు. ప్రతి ఉద్యోగికి రూ.10లక్షల ఆరోగ్యబీమా, పదవీ విరమణ కింద ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు రూ.20లక్షలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌సింగ్, సమగ్ర ఉద్యోగులు సర్వర్, శ్రీనివాస్, ఇస్మాయిల్, మొగులప్ప, రాములు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్ : పట్టణశివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామివారికి శ్రావణమాసం రెండవ శనివారం పురసస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర లేపనం, తమలపాకులతో విశేష అలంకరణ, దూపదీప నైవేద్యాలను సమర్పించారు. మంగళహారతులు అందిస్తూ దర్శించుకున్నారు. శ్రీమహాదేవుని ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నారం పకిరప్ప ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అన్నారం, రావులపల్లి గ్రామాల మాజీ సర్పంచులు రమేష్‌రెడ్డి, అనిత పకిరప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శని త్రయోదశి ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దుద్యాల్: శనివారం శని త్రయోదశి రావడం చాలా అరుదు. శని త్రయోదశిని పురస్కరించుకుని మండలం పరిధిలోని హస్నాబాద్ కాశీ విశ్వనాధుడి సన్నిధిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శనిశ్వరుడికి నల్లనువ్వులు, నువ్వుల నూనేతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం కాశీ విశ్వనాథస్వామికి పంచామృతాభిషేకం, శివాష్టం , భిల్వష్టం తదితర మంత్ర ఉచ్చరణతో ప్రత్యేక పూజలు చేశారు.

నిరసనల హోరు

కోల్‌కత్తా నగరంలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వికారాబాద్ జిల్లాలోని వివిధ వైద్య సంఘాల ప్రతినిధులు, వైద్య విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. వైద్యులు ఓపీలను, వైద్య సేవలు బహిష్కరించగా, వైద్య విద్యార్థులు కళాశాలలు బహిష్కరించి నిరసన తెలిపారు. ఎమర్జెన్సీలో ఉన్న వైద్యులు, సిబ్బంది సైతం నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.



పరిగి: నిరసనలో పాల్గొన్న వైద్య బృందం



వికారాబాద్: ప్రభుత్వ ఆస్పత్రి వద్ద..



కొడంగల్ : అంబేడ్కర్ చౌరస్తాలో..



మోమిన్‌పేట: ఆర్‌ఎంపీ డాక్టర్ల నిరసన



తాండూరు: అంబేడ్కర్ చౌక్ వద్ద మానవహారం



తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వద్ద



కొడంగల్ రూరల్ : ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో..